
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 17 । నవంబర్ । 2023



సోమశిలలో 29.63 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారానికి 29.63 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 27 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,450
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రాము)	రూ.5,614
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,782
నవర (8 గ్రాములు)	రూ.46,256

గరిష్టం/కనిష్టం
33.0 /24.4

వాతావరణం

గాలిలో తేమ 64 శాతంగా గురువారం నమోదైంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆకాశం శుక్రవారం మేఘావృతమై ఉంటుందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

సహకార సంఘాల అభివృద్ధికి కృషి



సహకార పతాకానికి వందనం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సహకార సంఘాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని డీసీఓ సుధాభారతి పేర్కొన్నారు. అఖిల భారత సహకార వారోత్సవాలను పురస్కరించుకొని సహకార సంస్థల డిజిటలైజేషన్, సాంకేతిక స్వీకరణ అనే అంశంపై నగరంలోని డివిజనల్ కో ఆపరేటివ్ అధికారి కార్యాలయంలో కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సహకార పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడారు. సహకార సంఘాలను కంప్యూటరీకరిస్తున్నారని వివరించారు. దీంతో రైతులకు సంబంధించిన ఈ – క్రాప్, వడ్డీ రాయితీ, ఎరువులు, విత్తనాల విక్రయాలకు సంబంధించిన అంశాల్లో పారదర్శకత ఏర్పడిందన్నారు. సహకార శాఖ ఆడిట్ అధికారి తిరుపతయ్య, క్రిబ్‌కో జిల్లా మేనేజర్ మురళీధర్‌రెడ్డి, సహకార విద్యాధికారి గోగుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వాహన ఫిట్‌నెస్ కేంద్రంలో తనిఖీలు



ఫిట్‌నెస్ పత్రాలను పరిశీలిస్తున్న చందర్

నెల్లూరు (టౌన్): గొలగమూడి రోడ్డు సెంటర్‌లోని వాహన సామర్థ్య ధ్రువీకరణ పత్ర తనిఖీ కేంద్రాన్ని రవాణా శాఖ ఉప రవాణా కమిషనర్ చందర్ గురువారం తనిఖీ చేశారు. వాహనాల ఫిట్‌నెస్‌కు సంబంధించిన కొత్త పోర్టల్ ఎన్ఐసీలో వాహన సామర్థ్య ధ్రువీకరణ ప్రక్రియను ఎలా చేయాలో అక్కడి అధికారులకు వివరించారు. అనధికార వ్యక్తుల ప్రమేయం లేకుండా ఫిట్‌నెస్ పత్రాన్ని జారీ చేయాలని ఆదేశించారు. ఎమ్వీఐ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి వ్యవసాయాధికారి సరెండర్

- కొత్త డీఏఓగా సత్యవాణి



బాధ్యతలు స్వీకరిస్తున్న సత్యవాణి

నెల్లూరు(సెంట్రల్): జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజును ప్రభుత్వానికి కలెక్టర్ హరినారాయణన్ గురువారం సరెండర్ చేశారు. జిల్లాకు సంబంధించిన సాగు వివరాల్లో తప్పుడు లెక్కలను ఇటీవల నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో జిల్లా ఉన్నతాధికారులకు అందజేశారనే అంశాన్ని కనుగొన్నారు. గతంలో సైతం వ్యవసాయానికి సంబంధించిన విషయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు ఆయనపై ఆ శాఖ అధికారులు పలు ఫిర్యాదులు చేశారని సమాచారం. దీంతో ఆయనపై సరెండర్ వేటు పడిందని తెలుస్తోంది.

బాధ్యతలు స్వీకరించిన సత్యవాణి

జిల్లా వ్యవసాయాధికారిగా సత్యవాణిని నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. తక్షణమే బాధ్యతలు స్వీకరించాలని ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో బాధ్యతలను గురువారం ఆమె స్వీకరించారు.

వీఎస్‌యూలో మలేసియా వర్సిటీ ప్రతినిధులు



వెంకటాచలం: మండలంలోని కాకుటూరు సమీపంలో గల విక్రమ సింహపురి యూనివర్సిటీని మలేసియా కెలాంతన్ వర్సిటీ ప్రతినిధులు డాక్టర్ మహమ్మద్ ఆరిఫుల్లా, డాక్టర్ మహమ్మద్ నూర్బైజ్ కరీమ్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వీఎస్‌యూ వీసీ సుందరవల్లి, రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డితో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అకడమిక్, రీసెర్చ్ యాక్టివిటీస్.. విద్యార్థులు, స్టాఫ్ మొబిలిటీ ప్రోగ్రామ్స్ పరంగా వీఎస్‌యూతో కలిసి పని చేసేందుకు తమ ఆసక్తిని కనబర్చారు. దీంతో వీఎస్‌యూ అధికారులు త్వరలో మలేసియా వెళ్లి కెలాంతన్ యూనివర్సిటీని సందర్శించి పూర్తి స్థాయిలో అన్ని విషయాలను చర్చించి ఎంఓయూను కుదుర్చుకోనున్నారు.

జిల్లాలో 27 నుంచి కులగణన







కులగణనపై నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, హాజరైన అధికారులు

- సర్వేలో ప్రతి ఒక్కర్నీ నమోదు చేయాలి
- ప్రతి మూడు సచివాలయాలకు ఒక క్లస్టర్
- క్లస్టర్‌కో ప్రత్యేకాధికారి
- రోజువారీగా సర్వే నివేదిక
- అధికారుల శిక్షణలో జేసీ కూర్మనాథ్

నెల్లూరు (పొగతోట): జిల్లాలో ఈ నెల 27 నుంచి డిసెంబర్ మూడు వరకు నిర్వహించనున్న కులగణన సర్వేలో జిల్లాలోని 769 గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో గల ప్రతి ఒక్కర్నీ నమోదు చేయాలని కులగణన జిల్లా నోడల్ అధికారి, జేసీ కూర్మనాథ్ ఆదేశించారు. రాష్ట్ర కులగణన – 2023లో భాగంగా ఎంపీడీఓలు, తహసీల్దార్లు, స్పెషలాఫీసర్లకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నగరంలోని జెడ్పీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దాదాపు శతాబ్ద కాలం తర్వాత కులగణన కార్యక్రమాన్ని చేపడుతున్నారని, ఎక్కడా ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందు జాగ్రత్త చర్యలను చేపట్టాలని సూచించారు. జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమంలో అందరూ సంపూర్ణ అవగాహనను పెంపొందించుకోవాలని కోరారు. తదుపరి డివిజనల్, మండల స్థాయిలోని కింది సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మూడు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా పరిగణించి ప్రత్యేకాధికారిని నియమించామని తెలిపారు. క్లస్టర్ స్థాయి అధికారులపై గురుతర బాధ్యత ఉంటుందన్నారు. దీనికి అనుగుణంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని కోరారు. సర్వే జరిగే సమయంలో రోజూ సాయంత్రం ఏడుకు టెలి కాన్ఫరెన్స్‌ను కలెక్టర్ నిర్వహించనున్నారని, పురోగతిని తెలియజేయాల్సి ఉంటుందన్నారు. కులగణనకు.. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆయా క్లస్టర్లలోని ప్రజలకు సర్వేపై ముందస్తు సమాచారాన్ని అందించాలని సూచించారు. అనంతరం జెడ్పీ సీఈఓ చిరంజీవి మాట్లాడారు. గతంలో నిర్వహించిన సర్వేల కంటే కుల సర్వే విభిన్నమైందన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు విధిగా హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మూడు రకాల ఈ – కేవైసీ చేయాల్సి ఉంటుందని, వారి మొబైల్స్, ఇతర ఉపకరణాలను సర్వే ప్రారంభమయ్యేలోపు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. బయట ప్రాంతాలకు వెళ్లిన వారి విషయంలో ఓటీపీ ద్వారా ఈ – కేవైసీని చేయొచ్చన్నారు. ట్రెయినీ కలెక్టర్ సంజనా సిన్హా, ఆర్డీఓలు మలోల, శీనానాయక్, జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య, ఐటీడీఏ పీఓ మందా రాణి, ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎలాంటి అపోహలొద్దు

నెల్లూరు(దర్గామిట్ట): ఈ నెల 27 నుంచి నిర్వహించనున్న కులగణనకు.. ఇప్పటికే అమల్లో ఉన్న సంక్షేమ పథకాలకు ఎలాంటి సంబంధం లేదని, ఈ విషయంలో ఎలాంటి అపోహలొద్దని జేసీ కూర్మనాథ్ పేర్కొన్నారు. కులగణనకు సంబంధించి కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజలు తెలియజేసిన వివరాలనే నమోదు చేయనున్నామని, దీనికి ఎలాంటి ఆధారాలను ఇవ్వాల్సిన అవసరం లేదని చెప్పారు. కులాల వారీగా జనాభా, వారి సామాజిక, ఆర్థిక, విద్య, పురోభివృద్ధిని తెలుసుకునేందుకు ఉపయోగపడనుందని చెప్పారు. సర్వేలో పాల్గొనే ఉద్యోగులకు అవసరమైన శిక్షణను ఇస్తున్నామని పేర్కొన్నారు. సూచనలు, సలహాలు, అభిప్రాయాలను తెలియజేయాలనుకునే వారు castesurveynlr@gmail.comకు మెయిల్ పంపాలని కోరారు. అనంతరం జెడ్పీ సీఈఓ చిరంజీవి మాట్లాడారు. ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా 34 కాలమ్స్‌తో కూడిన పట్టికలో సమాచారాన్ని సేకరించి నమోదు చేయనున్నారని వెల్లడించారు. ప్రతి కుటుంబసభ్యుడి వద్ద మూడు రకాల ఈ – కేవైసీల ద్వారా నమోదు చేస్తామన్నారు. ఆత్మకూరులో ఇప్పటికే పైలట్ ప్రాజెక్ట్‌ను నిర్వహించామని తెలిపారు. కుల సంఘాల నేతలు వెంకయ్య, చెంచయ్య, శ్రీహరిరావు, మస్తానమ్మ, సుబ్బయ్య, జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య, ఐటీడీఏ పీఓ మందా రాణి, జంగమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ప్రసన్న, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సైదానీ, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి నిర్మలాదేవి, ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఓలకు పోస్టింగ్‌లు

నెల్లూరు (పొగతోట): ఉపాధి హామీ పథకానికి సంబంధించి 16 మంది కంప్యూటర్ ఆపరేటర్లకు మండలాలను కేటాయిస్తూ డ్వామా పీడీ వెంకట్రావ్ ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలోని డ్వామా కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పనిచేస్తున్న 16 మంది కంప్యూటర్ ఆపరేటర్లను ఇతర జిల్లాలకు బదిలీ చేశారని చెప్పారు. తాజాగా వీరిని జిల్లాకు కేటాయించారన్నారు. ఈ క్రమంలో కలెక్టర్ ఆదేశాల మేరకు కమిటీ సమావేశమై మండలాలను కేటాయించామని తెలిపారు.

ఆత్మకూరు చెరువులో అరుదైన చేప



ఆత్మకూరు: పట్టణంలోని మేజర్ చెరువులో మత్స్యకారుల వలలో అరుదైన చేప గురువారం చిక్కింది. అరుదైన ఈ చేప నీళ్లలోనే కాకుండా వెలుపల సైతం మూడు నుంచి నాలుగు రోజుల పాటు జీవించగలదని మత్స్యకారులు పేర్కొన్నారు. వలలో చిక్కిన ఈ చేప శరీరం చుక్కలు, మచ్చలతో కూడి ఉంది. దీన్ని విమానం చేప అని పిలుస్తారని మత్స్యకారులు తెలిపారు.

పేదలకు అండగా నిలుస్తాం



చెక్కును అందజేస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: పేద కుటుంబాలకు అండగా నిలవడమే తమ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గృహ లబ్ధిదారులైన 122 మంది గిరిజనులకు రూ.15 వేల చొప్పున అదనపు నగదు చెక్కులను వెంకటాచలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఇళ్లు లేని పేదలను గుర్తించి స్థలంతో పాటు గృహాలను నిర్మిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ వర్గాలకు మాత్రమే ఇళ్లు, పింఛన్లు మంజూరు చేసేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం పార్టీలతో ప్రమేయం లేకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చెప్పారు. గిరిజనులు ఆర్థికంగా వెనుకబడి ఉండటంతో ఇళ్ల నిర్మాణాలు ఆలస్యమవుతున్నాయని, దీంతో వీరికి అదనంగా రూ.15 వేలను అందజేస్తున్నామని వెల్లడించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఇప్పటి వరకు 1520 మంది గిరిజన లబ్ధిదారులకు రూ.2.28 కోట్లను అందజేశామన్నారు.

అభివృద్ధిని అడ్డుకునేందుకు సోమిరెడ్డి కుట్రలు

గత ప్రభుత్వంలో మంత్రిగా వ్యవహరించిన సోమిరెడ్డి నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించి.. దోచుకోవడం, దాచుకోవడంపైనే దృష్టి పెట్టారని మంత్రి ఆరోపించారు. నీరు – చెట్టు, రైతు రథం, మిల్లర్ల వద్ద ముడుపులతో కోట్ల ప్రజాధనాన్ని దోచుకొని ప్రజల ఛీత్కారానికి గురయ్యారని తెలిపారు. తమ ప్రభుత్వంలో సర్వేపల్లిలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అడుగడుగునా అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. పేదలకు ఇళ్ల స్థలాలు, అసైన్‌మెంట్ పట్టాలివ్వడాన్ని సైతం అడ్డుకునేందుకు యత్నించడం సిగ్గుచేటని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు అసైన్‌మెంట్ పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 25 వరకు పండగ వాతావరణంలో నిర్వహించనున్నామని వెల్లడించారు. ఎంపీపీ మందా కవిత, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండ రామిరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, మండలాధ్యక్షుడు కొణిదెన మోహన్‌నాయుడు, యువజన విభాగ మండలాధ్యక్షుడు రజనీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, నేతలు ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి, విజయభాస్కర్‌నాయుడు, వెలిబోయిన వెంకటేశ్వర్లు, చీకుర్తి నరసయ్య, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి లక్ష్యాల పురోగతిపై ప్రత్యేక దృష్టి

నెల్లూరు(దర్గామిట్ట): సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా ప్రాధాన్య ఇండికేటర్ల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించి సాధనకు కృషి చేస్తున్నామని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. జిల్లాల్లో అమలవుతున్న సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా ప్రాధాన్య ఇండికేటర్ల సాధన, మహిళల ఆరోగ్యం, పిల్లల సంక్షేమం, విద్య, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం తదితరాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో అమరావతి నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి గురువారం వర్చువల్‌గా సమావేశమయ్యారు. వివిధ అంశాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హాజరయ్యారు. సాధించిన లక్ష్యాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీఎంహెచ్ఓ పెంచలయ్య, డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్, డీఈఓ గంగాభవాని, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, పరిశ్రమల శాఖ జీఎం సుధాకర్, పర్యాటక శాఖ జిల్లా అధికారి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన హరినారాయణన్

క్రికెట్ విజేతగా సెంట్రల్ జోన్



ఏడు వికెట్లు పడగొట్టిన అబ్దుల్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని బుజబుజనెల్లూరులో గల సీఏపీ క్రీడామైదానంలో నిర్వహిస్తున్న అండర్ – 16 ఇంటర్ జోనల్ క్రికెట్ మ్యాచ్ ఉత్కంఠభరితంగా గురువారం సాగింది. నార్త్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 175 పరుగులకు ఆలౌటైంది. జట్టులోని ఫణీంద్ర 56 పరుగులు సాధించగా, సెంట్రల్ జోన్‌లోని అబ్దుల్ జబ్బార్ ఏడు వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్ చేసిన సెంట్రల్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో మూడు వికెట్ల నష్టానికి 67 పరుగులు సాధించి విజేతగా నిలిచింది. ఏసీఏ సెలక్టర్లు మలిరెడ్డి కోటారెడ్డి, ఎన్డీసీఏ జిల్లా కార్యదర్శి నిఖిలేశ్వర్‌రెడ్డి, మాజీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

‘ఆడుదాం ఆంధ్రా’కు మైదానాల పరిశీలన



క్రీడా స్థలాన్ని పరిశీలిస్తున్న పీడీ సాంబశివారెడ్డి

కోవూరు : మండల పరిధిలో డిసెంబర్‌లో నిర్వహించనున్న ‘ఆడుదాం ఆంధ్రా’ క్రీడా పోటీలకు సంబంధించి అనువైన మైదానాలను కోవూరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఎంపీడీఓ శ్రీహరి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రికెట్, వాలీబాల్, షటిల్, ఖోఖో, కబడ్డీ పోటీలకు సంబంధించి మండలంలో అనువైన క్రీడా మైదానాలను అన్వేషిస్తున్నామని వివరించారు.

కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, వశిష్ట ఆంగ్ల మాధ్యమ పాఠశాల, గుమ్మళ్లదిబ్బ, పాటూరు, ఇనమడుగు, లేగుంటపాడు, వేగూరు గ్రామాల్లో ఉన్న ఉన్నత పాఠశాలల క్రీడా ప్రాంగణాలను పరిశీలించామని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు నరసింహమూర్తి, ఫిజికల్ డైరెక్టర్లు దేవిక, మధుసూదన్‌రావు, రమేష్‌బాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

నెల్లూరు(దర్గామిట్ట): ఓటర్ల జాబితా సమ్మరీ రివిజన్లో భాగంగా ఓటర్లకు సంబంధించిన ఫారాల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముకేష్‌కుమార్ మీనా ఆదేశించారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ.. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల స్థితి.. స్త్రీ, పురుష ఓటర్ల నిష్పత్తి.. ఓటర్ల నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలు.. ఎపిక్ కార్డుల జనరేషన్, పంపిణీ తదితర అంశాలపై కలెక్టర్లతో సచివాలయం నుంచి గురువారం ఆయన సమీక్షించారు. 18, 19 ఏళ్ల వయస్సు గల యువతను గుర్తించి ఓటర్లుగా చేర్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఎపిక్ కార్డుల జనరేషన్, పంపిణీపై దృష్టి సారించాలన్నారు. కలెక్టర్ హరినారాయణన్, డీఆర్వో లవన్న పాల్గొన్నారు.

తాళ్లపూడికి మహర్దశ

- స్వగ్రామంపై ఎంపీ విజయసాయిరెడ్డికి ఎనలేని అభిమానం
- అన్ని రంగాల్లో అభివృద్ధి
- మోడల్ విలేజ్‌గా రూపకల్పన
- ఇప్పటికే రూ.ఐదు కోట్లతో పనులు



సుందరంగా తాళ్లపూడికి వెళ్లే సీసీ రోడ్డు

ముత్తుకూరు: మండలంలోని తాళ్లపూడి గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది. తన స్వగ్రామాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో రాజ్యసభ సభ్యుడు వేణుంబాక విజయసాయిరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా 2020, జనవరి 16న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో కలిసి గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామస్తులు, అధికారులతో సమావేశమై చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారు. వీటికి అంచనాలను రూపొందించాలని ఆదేశించారు. ఎంపీ, సీఎస్సార్, జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దాలని సంకల్పించారు.

అభివృద్ధిపై నిరంతర సమీక్ష

తాళ్లపూడిలో చేపట్టే అభివృద్ధి పనులపై ఎంపీ నిరంతరం సమీక్ష చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో చర్చిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో తాళ్లపూడిలో ఇటీవల పర్యటించారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. జరిగిన అభివృద్ధి పనులను స్వయంగా పరిశీలించారు. చేపట్టాల్సిన పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సుమారు రూ.ఐదు కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని ఎంపీ విజయసాయిరెడ్డి ప్రకటించారు. మరో రూ.15 కోట్ల మేరకు పనులు జరగాల్సి ఉందని, వీటిని సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

చేపట్టనున్న అభివృద్ధి పనులు

- ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేసి స్థలాన్ని సేకరించారు
- గ్రామంలో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్ల నిర్మాణం, శ్మశానాల అభివృద్ధి
- అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం
- నీటి దొరువుల ఆధునీకరణ
- సౌర విద్యుత్ వీధి దీపాలు
- ఎల్లవ కాలువ, వాకింగ్ ట్రాక్, కన్వెన్షన్ హాల్ నిర్మాణం
- బసరాలదిబ్బ మీదుగా పల్లెపాడుదిబ్బ వరకు రోడ్డు నిర్మాణం




ఆధునికీకరించిన తాతాయి గుంట




తాళ్లపూడిలో పర్యటిస్తున్న ఎంపీలు విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి, గురుమూర్తి (ఫైల్)

తాళ్లపూడి అభివృద్ధి సంతోషకరం



తాళ్లపూడి గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుండటం సంతోషంగా ఉంది. అన్ని శాఖల ప్రభుత్వాధికారుల నిరంతర పర్యవేక్షణలో అవసరమైన పనులు జరుగుతున్నాయి.
– వేణుంబాక శేషారెడ్డి, మాజీ సర్పంచ్

ఊహించని విధంగా అభివృద్ధి



రాజ్యసభ సభ్యుడు వేణుంబాక విజయసాయిరెడ్డి కృషి.. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో తాళ్లపూడిలో ఊహించని విధంగా అభివృద్ధి జరుగుతోంది. ఈ రకమైన అభివృద్ధితో చాలా గర్వంగా ఉంది.
– మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, వైఎస్సార్సీపీ మండలాధ్యక్షుడు

అన్ని విధాలా గ్రామాభివృద్ధి



తాళ్లపూడి ఈ స్థాయిలో అభివృద్ధి చెందుతుందని ఊహించలేదు. స్వగ్రామంపై మమకారంతో ఎంపీ విజయసాయిరెడ్డి అన్ని విధాలా అభివృద్ధి చేయడం ఆనందంగా ఉంది.
– శివప్రసాద్‌రెడ్డి, స్థానికుడు

క్లుప్తంగా

నీరు వదిలిన వెంటనే నార్లు పోసుకోవాలి



సంగం ఏఓతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు

సంగం: ఐఏబీ తీర్మానం ప్రకారం ఈ నెల 20 నుంచి డెల్టాకు సాగునీటిని విడుదల చేస్తారని, వెంటనే రైతులు నార్లు పోసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు సూచించారు. గురువారం సంగం వ్యవసాయ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఎరువులు, విత్తనాల నిల్వలపై ఏఓ శ్రీహరితో చర్చించారు. అనంతరం తరుణవాయి ఆర్బీకేను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ సోమశిలలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున వెంటనే నార్లు పోసుకుని నాట్లు వేసుకోవాలని సూచించారు. జిల్లాలోని రైతులకు ఎరువులు, విత్తనాలు కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

నేడు బీజేపీ రాష్ట్రాధ్యక్షురాలు పురందేశ్వరి పర్యటన

నెల్లూరు(మినీబైపాస్): బీజేపీ రాష్ట్రాధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి శుక్రవారం నెల్లూరుకు రానున్నారు. ఉదయం 8.30 గంటలకు రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి ఇంట్లో అల్పాహార విందు, 9.30 నుంచి 10.30 గంటల వరకు నెల్లూరు రైల్వేస్టేషన్ సందర్శన, 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కస్తూరీదేవి గార్డెన్స్‌లో కార్యకర్తలతో సమీక్ష సమావేశం, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొననున్నట్లు పార్టీ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది.

వీఆర్‌కు దిశ ఎస్సై

నెల్లూరు(క్రైమ్): పరిపాలన సౌలభ్యంలో భాగంగా దిశ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై లేఖాప్రియాంకను వీఆర్‌కు బదిలీచేస్తూ ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. దీంతో గురువారం ఆమె విధుల నుంచి రిలీవై వీఆర్‌లో రిపోర్టు చేశారు. ఆమె స్థానంలో ఎవ్వరిని నియమించలేదు.

ట్రాన్స్‌కో విజిలెన్స్ తనిఖీలు

- 20 కేసులు నమోదు



తనిఖీలు చేపడుతున్న ట్రాన్స్‌కో విజిలెన్స్ అధికారులు

కోవూరు : పట్టణంలోని పలు ప్రాంతాల్లో ట్రాన్స్‌కో విజిలెన్స్ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. విద్యుత్ మీటర్లు, సర్వీసు వైర్లను నిశితంగా పరిశీలించారు. 19 గృహాల యజమానులు అడిషనల్ లోడ్ వాడుతున్నట్లు, ఒకరు అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో ట్రాన్స్‌కో విజిలెన్స్ డీఈఈ కే కృష్ణమూర్తి, ఏఈ కే సుధీర్, తదితరులు పాల్గొన్నారు..

ఆటోను ఢీకొన్న కారు

- నలుగురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

మర్రిపాడు: మండల పరిధిలోని నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయాల పాలయ్యారు. వివరాలు.. జిల్లా సరిహద్దు వద్ద బద్వేల్ నుంచి వస్తున్న కారు దుత్తలూరు నుంచి బద్వేల్‌కు వెళ్తున్న ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు, ఆటో దెబ్బతిన్నాయి. ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. మర్రిపాడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించిందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 11వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. నాలుగున్నరేళ్ల కాలంలో ప్రభుత్వం కల్పించిన సంక్షేమ లబ్ధిని వివరించే బుక్‌లెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామిరెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలను నూరు శాతం నెరవేర్చడంతో పాటు పారదర్శక పాలనతో ఆదర్శంగా నిలిచారని వివరించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా గడప గడపకు సంక్షేమ ఫలాలు చేరవేస్తున్నారని తెలిపారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి, ఉపాధి కల్పనలోనూ రాష్ట్ర ప్రభుత్వం ముందంజలో ఉందన్నారు. రామాయపట్నంపోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్‌హార్బర్ నిర్మాణాలతో కావలి నియోజకవర్గ రూపురేఖలు మారనున్నాయన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభించనున్నాయని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో పారదర్శకత, పథకాల మంజూరులో వేగం, అభివృద్ధిలో నిర్మాణాత్మక నిర్ణయాలతో రాష్ట్రం సమగ్రాభివృద్ధి దిశగా వడివడిగా అడుగులు వేస్తోందన్నారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో నూరు శాతం సంతృప్తి ఉందన్నారు. ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసం చూసిన ప్రతిపక్షాలు ఆశలు వదిలేసుకున్నాయని ఎద్దేవా చేశారు. టీడీపీని, ఆ పార్టీకి వంత పాడుతున్న తోకపార్టీలు, పచ్చపత్రికలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. సీఎం వైఎస్ జగన్‌ను కుటుంబ సభ్యుడిలా భావిస్తున్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా మళ్లీ వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనుమర్లపూడి వెంకటనారాయణ, కుందుర్తి శ్రీనివాసులు, కుందుర్తి కామయ్య, కుందుర్తి సునీత, ఆత్మకూరు రాజేష్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే అనిల్‌కుమార్


అభివృద్ధి చేశాననే భ్రమల్లో నారాయణ

- నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలో తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను నాలుగున్నరేళ్ల తరువాత వచ్చి చూసిన నారాయణ అంతా తానే చేశాననే భ్రమల్లో ఉన్నారని నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ విమర్శించారు. నగరంలోని 16వ డివిజన్ జగదీష్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రూ.60 లక్షలతో, 15వ డివిజన్ బాలాజీనగర్ ఆంధ్రాబ్యాంకు వద్ద రూ.40 లక్షలతో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ 16వ డివిజన్ పరిధిలోని రాంజీనగర్–జగదీష్ నగర్ మధ్యన కాలువతో ఇబ్బందిగా ఉండగా డ్రెయిన్ నిర్మించి రోడ్డు వేసి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చేశామన్నారు. 13, 14, 15, 16 డివిజన్లకు సంబంధించి ఎక్కడెక్కడ రోడ్లు అవసరమో గుర్తించి అన్ని పనులు చేపట్టామన్నారు. 16వ డివిజన్‌లో దాదాపు రూ.12 కోట్లతో, 15వ డివిజన్‌లో రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. 2019 అసెంబ్లీ ఎన్నికలకు ఆరు నెలల ముందు హడావిడిగా నాశిరకంగా అభివృద్ధి పనులు చేసిన వారికి ప్రస్తుతం తాము చేసిన, చేస్తున్న అభివృద్ధి పనులు కనిపించవన్నారు. హరనాథపురం సెంటర్‌లో ఫ్లైఓవర్, నాలుగు లైన్ల మైపాడు రోడ్డు, సర్వేపల్లి, జాఫర్ సాహెబ్ కాలువలకు ఇరువైపులా ప్రహరీ నిర్మాణ పనులు, పెన్నా బ్యారేజీని పూర్తి చేసింది తామేనన్నారు. కేవలం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలకు సంబంధించి దాదాపు రూ.32 కోట్లతో రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్ స్తంభాల మార్పు, తదితర పనులు చేపట్టామని గుర్తుచేశారు. తమ ప్రభుత్వంలో చేపట్టిన పనులను నాలుగురన్నరేళ్ల తర్వాత వచ్చి చూసిన నారాయణ అంతా తానే చేశాననే భ్రమలో ఉన్నారేమో, అలాంటి భ్రమల నుంచి బయటకు రావాలన్నారు. ప్రజల మధ్యన వీధుల్లో తిరిగితే తాము చేపట్టిన అభివృద్ధి పనులు కనిపిస్తాయన్నారు. టిడ్కో ఇళ్లకు సంబంధించి పేదలపై భారం మోపితే తమ ప్రభుత్వం వచ్చాక దాన్ని మాఫీ చేశామన్నారు. నగర నియోజకవర్గంలో అభివృద్ధిపై చర్చకు పిలిస్తే తాము రామని నారాయణ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సొంత పార్టీ నాయకులతో పనిచేయించుకోలేక ఎన్–టీం పేరుతో విద్యా సంస్థల సిబ్బందికి జీతాలు ఇచ్చి పార్టీ పనులు చేయించుకునే స్థితికి నారాయణ వచ్చారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, గణేశం సుజాత, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సైతం టీడీపీ పాలనను కోరుకోవడం లేదు

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: 'గత నాలుగు సంవత్సరాల కాలంలో సోమశిల జలాశయం 400 టీఎంసీల నీటిని జిల్లా ప్రజలకు అందించింది.ఈ ఏడాది ప్రతిపక్ష నాయకుడు ఆత్మకూరు నియోజకవర్గంలో పది కిలోమీటర్లు పాదయాత్ర చేయడంతో సోమశిల జలాశయం ఎండిపోయేలా వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రకృతి సైతం వారి పాలనను కోరుకోవడం లేదు. టీడీపీ పాలనలో ప్రజలు ఎన్ని కష్టాలు అనుభవించారో దీనిని బట్టే తెలుస్తుంది' అని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని భీమవరం సచివాలయం పరిధిలో గురువారం నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు జగనే కావాలి' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో కలిసి సచివాలయంలో సంక్షేమ పథకాల లబ్ధిని తెలిపే ఫ్లెక్సీని ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేశారని తెలిపారు. పారదర్శకంగా సచివాలయ వ్యవస్థ ద్వారా గడప గడపకు సంక్షేమ ఫలాలను చేరవేశారని వివరించారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలను నూరు శాతం అమలు చేయడంతో తాము ప్రజల ముందుకు ధైర్యంగా వస్తున్నామన్నారు. దివంగత సీఎం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్, 108, 104 సేవలతో ప్రజల గుండెల్లో కొలువయ్యారని తెలిపారు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం వైఎస్సార్ పథకాలను నిర్వీర్యం చేయాలని చూసిందన్నారు. రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మాట తప్పారని గుర్తుచేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలపైన ఎన్నో అభాండాలు వేశారన్నారు. గత ప్రభుత్వంలో పింఛన్ తీసుకునేందుకు వృద్ధులు, దివ్యాంగులు వ్యయప్రయాసాలకు గురయ్యేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం వలంటీర్లు ఇంటి వద్దకే తెచ్చి అందజేస్తున్నారని, సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమవుతున్నాయని వివరించారు. టీడీపీ ప్రభుత్వ పాలనతో రాష్ట్రం అభివృద్ధిలో పదేళ్ల వెనక్కు వెళ్లిందన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఎన్నుకోవడంతో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకెళ్తుందన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి రాబోయే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులు నాయుడు, పొంగూరు సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, నాయకులు తిరుపాల్‌నాయుడు, చెవుల శ్రీనివాసులు, రామరత్నారెడ్డి, బొర్రా వెంకటేశ్వరరెడ్డి, పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి

- ఉన్నతి విభాగం డైరెక్టర్ రాజాప్రతాప్

నెల్లూరు (ఫొగతోట): పొదుపు మహిళలు తమ జీవనోపాధుల కోసం తీసుకున్న రుణాలతో అంచెలంచెలుగా ఎదిగి అన్ని రంగాల్లో రాణించాలని ఉన్నతి విభాగం డైరెక్టర్ రాజాప్రతాప్ పిలుపునిచ్చారు. జిల్లా సమాఖ్య 17వ వార్షికోత్సవ మహాసభను డీఆర్డీఏ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. ఈ మహాసభలో ఉన్నతి విభాగం డైరెక్టర్ రాజా ప్రతాప్ పాల్గొని మాట్లాడారు. ప్రతి పొదుపు మహిళ పొదుపు రుణాలను సద్వినియోగం చేసుకుని అంచెలంచెలుగా ఎదిగి భూములను కొనుగోలు చేసి ఒక సుస్థిరమైన ఆస్తి ఉండేలా చూసుకోవాలన్నారు. మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించడంలో భాగంగా జిల్లాలో డ్రైవింగ్ వచ్చిన 13 మంది సంఘ మహిళలకు ఆటోలకు వడ్డీలేని రుణాలు మంజూరు చేశామని తెలిపారు. డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని కొడవలూరు మండలంలో సంస్థాగత నిర్మాణం, జీవనోపాధులు కల్పించారన్నారు. పంచాయతీరాజ్ శాఖ సమన్వయంతో పనిచేయడం, సకాలంలో రుణాలు చెల్లింపు, తదితర మండల సమాఖ్య కార్యక్రమాలను కొలమానంగా తీసుకుని ఏపీఎంఏఎస్ సంస్థ దేశ వ్యాప్తంగా రూపొందించిన ఉత్తమ మండల సమాఖ్యల నామినేషన్ విభాగాల్లో సౌత్ జోన్‌లో రెండో స్థానంలో నిలవడం మన జిల్లాకు గర్వకారణమన్నారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ఎస్ శారదమ్మ మాట్లాడుతూ జిల్లా సమాఖ్య ఏర్పాటు అయినప్పటి నుంచి సంఘాలు, సమాఖ్యలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీ మెంబర్‌లు, ఏపీడీ, డీపీఎంఐబీ, ఏసీలు, ఏపీఎంఐబీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ పిలుపునిచ్చారు. బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్లను కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో గురువారం కలెక్టర్ ఆవిష్కరించారు. ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీఓ శీనానాయక్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన, డీసీపీఓ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు



మాట్లాడుతున్న ఉపాధ్యాయిని సుధారాణి

నెల్లూరు(మినీబైపాస్): నగరంలోని రేబాలవారి వీధిలోని జిల్లా కేంద్రం గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మూడోరోజు గురువారం గ్రంథాలయ ఉద్యమకారులకు ఘనంగా నివాళులర్పించారు. పౌర గ్రంథాలయ ఉపసంచాలకులు కే పీర్‌అహ్మద్, తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షుడు చెలంచర్ల భాస్కరరెడ్డి, ఉపాధ్యాయిని సుధారాణి, తదితరులు గ్రంథాలయ ఉద్యమకారుల జీవిత విశేషాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసైన్స్‌వేదిక అధ్యక్షుడు ఎం సతీష్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజా, లైబ్రేరియన్ సీహెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

నెల్లూరు సిటీ: ప్రైవేట్ ఆస్పత్రుల్లో అనుమతుల్లేకుండా గర్భకోశ వైద్య నిపుణులు ఎవరైనా స్త్రీలు గర్భం దాల్చుటకు ఐయూఐ(ఇన్ట్రా యుటెరిన్ ఇన్‌సెమినేషన్) పద్ధతిని ఆచరిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఎం పెంచలయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏఆర్‌టీ చట్టం కింద ఏఆర్‌టీ క్లీనిక్ లెవెల్–1గా తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. అందుకోసం గర్భకోశ వైద్యనిపుణులు ఆన్‌లైన్‌లో నిర్ణీత ఫీజు రూ.50వేలు డీడీ రూపంలో చెల్లించి డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

మహిళ ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): నేనున్నా..లేకున్నా చెల్లిని బాగా చూసుకోమని కుమారుడికి చెప్పి ఓ మహిళ గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై గురువారం నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. సత్యనారాయణపురానికి చెందిన శేఖర్‌రెడ్డి, పద్మజ(49) దంపతులు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. శేఖర్‌రెడ్డి ఆయిల్‌మిల్‌లో, కుమారుడు తలుపుల తయారీ దుకాణంలో పనిచేస్తున్నారు. కొన్ని నెలల క్రితం కుమార్తెకు వివాహం చేయగా బెంగుళూరులో ఉంటోంది. కుమార్తెపై పద్మజ దిగులు పెంచుకుంది. ఆమెను బాగా చూసుకోవాలని భర్త, కుమారుడికి తరచూ చెబుతూ ఉండేది. బుధవారం ఎప్పటిలాగే శేఖర్‌రెడ్డి, కుమారుడు పనులకు వెళ్లారు. ఈ క్రమంలో పద్మజ గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టింది. కుమారుడికి ఫోన్‌చేసి తాను చనిపోతున్నానని నేనున్నా...లేకున్నా చెల్లిని బాగా చూసుకోమని చెప్పింది. దీంతో భర్త, కుమారుడు బంధువులతో కలిసి హుటాహుటిన ఇంటికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను చికిత్స నిమిత్తం నగరంలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం పద్మజ మృతి చెందింది. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. నవాబుపేట ఎస్సై బీ శివ ప్రకాష్ హాస్పిటల్‌కు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పౌల్ట్రీ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: రూ.104
లేయర్ (లైవ్)	: రూ.105
బ్రాయిలర్ చికెన్	: రూ.190
స్కిన్‌లెస్ చికెన్	: రూ.210
లేయర్ చికెన్	: రూ.178

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.40
సన్నవి	: రూ.15
పండ్లు	: రూ.6

